మీ వెంటే మేముంటాం

- తుర్కపల్లిలో బీఆర్ఎస్ అధినేత కేసీఆర్‌కు ఘన స్వాగతం
- పెద్ద సంఖ్యలో తరలివచ్చిన గులాబీ శ్రేణులు
- పాల్గొన్న మాజీ ఎమ్మెల్యే గొంగిడి సునీత, ఎంపీ అభ్యర్థి క్యామ మల్లేశ్, డీసీసీబీ చైర్మన్ మహేందర్‌రెడ్డి, బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు కంచర్ల

తుర్కపల్లిలో కేసీఆర్‌కు ఘన స్వాగతం పలుకుతున్న రైతులు, పార్టీ శ్రేణులకు అభివాదం చేస్తున్న బీఆర్ఎస్ అధినేత కేసీఆర్

తుర్కపల్లి, మార్చి 31 : నీళ్లందక ఎండిపోయిన పంటలను పరిశీలించేందుకు క్షేత్రస్థాయి పర్యటన కోసం వచ్చిన బీఆర్ఎస్ అధినేత, మాజీ సీఎం కేసీఆర్‌కు ఘన స్వాగతం లభించింది. ఆదివారం ఎర్రవెల్లి ఫాంహౌజ్ నుంచి రోడ్డు మార్గంలో బయల్దేరిన కేసీఆర్‌కు తుర్కపల్లి మండల కేంద్రంలో బీఆర్ఎస్ ఆలేరు నియోజకవర్గ నాయకులు, ప్రజాప్రతినిధులు ఘన స్వాగతం పలికారు. పెద్ద సంఖ్యలో వచ్చిన గులాబీ శ్రేణులు జై కేసీఆర్.. జై బీఆర్ఎస్ అంటూ నినాదాలు చేశారు. మీ వెంటే మేముంటాం అంటూ నినదించారు. ఉదయం 10:14 గంటలకు తుర్కపల్లి మండల కేంద్రానికి చేరుకున్న గులాబీ దళపతి కేసీఆర్ వాహనంలోనే కూర్చుని పార్టీ శ్రేణులు, ప్రజలు, రైతులకు అభివాదం చేశారు. వాహనం ఎదురుగా భారీ సంఖ్యలో పార్టీ శ్రేణులు నినాదాలు చేస్తూ నడుస్తుండగా అభివాదం చేసుకుంటూ వాహనం ముందుకు సాగింది. నియోజకవర్గంలోని వివిధ మండలాలకు చెందిన సుమారు 4వేల మంది వచ్చి ఆయనకు స్వాగతం పలుకుతూ వాహనం వెంట నడిచారు. కేసీఆర్‌ను చూడగానే మండల ప్రజలు భావోద్వేగానికి లోనయ్యారు. ఒక్కసారిగా జై కేసీఆర్ అంటూ నినాదాలు చేస్తూ ఆయనను చూస్తుండిపోయారు. స్వాగతం పలికేందుకు వచ్చిన మాజీ ఎమ్మెల్యే గొంగిడి సునీతామహేందర్‌రెడ్డి వాహనం ఎక్కి కేసీఆర్‌కు పుష్పగుచ్ఛం అందజేశారు. భువనగిరి ఎంపీ అభ్యర్థి క్యామ మల్లేశ్ అభివాదం చేసి స్వాగతం పలికారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు కంచర్ల రామకృష్ణారెడ్డి, డీసీసీబీ చైర్మన్ గొంగిడి మహేందర్‌రెడ్డి, మదర్ డెయిరీ చైర్మన్ లింగాల శ్రీకర్‌రెడ్డి, జడ్పీ వైస్ చైర్మన్ బీకూనాయక్, ఎంపీపీలు భూక్యా సుశీలారవీందర్, చిమ్ముల సుధీర్‌రెడ్డి, జడ్పీటీసీలు తోటకూరి అనూరాధ, గోపాల్‌గౌడ్, పార్టీ రాష్ట్ర నాయకులు సూదగాని హరిశంకర్‌గౌడ్, స్థానిక నాయకులు కల్లూరి రామచంద్రారెడ్డి, గట్టు తేజస్వీనిఖిల్, నరేందర్‌రెడ్డి, కర్రె వెంకటయ్య, గంగుల శ్రీనివాస్, బొట్ల యాదగిరి, వెంకటేశ్ గౌడ్, రవీందర్‌గౌడ్, కొండల్‌రెడ్డి, మహేందర్, నరహరి పాల్గొన్నారు.

తుర్కపల్లిలో కేసీఆర్‌కు స్వాగతం పలికేందుకు తరలివచ్చిన బీఆర్ఎస్ శ్రేణులు

ధరావత్ తండాకు తరలిన బీఆర్ఎస్ శ్రేణులు

గుండాల, మార్చి 31 : మాజీ ముఖ్యమంత్రి, బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ జనగామ జిల్లా దేవరుప్పల మండలం ధరావత్ తండాకు ఆదివారం ఎండిపోయిన పంటల పరిశీలనకు రాగా.. గుండాల మండలానికి చెందిన బీఆర్ఎస్ శ్రేణులు భారీగా తరలివెళ్లారు. దేవరుప్పల, గుండాల సరిహద్దు మండలాలు కావడంతో అన్ని గ్రామాల నుంచి గులాబీ శ్రేణులు తరలివెళ్లి కేసీఆర్‌కు ఘన స్వాగతం పలికారు. వెళ్లిన వారిలో ఎంపీపీ తాండ్ర అమరావతీశోభన్‌బాబు, బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు ఎండీ ఖలీల్, మాజీ జడ్పీటీసీ మందడి రామకృష్ణారెడ్డి, నాయకులు ఉన్నారు.

తరలిన బీఆర్ఎస్ నాయకులు

ఆత్మకూరు(ఎం) : ఎండిపోయిన పంటలను పరిశీలించేందుకు ఆదివారం తుర్కపల్లి మీదుగా జనగాం జిల్లాకు వెళ్తున్న మాజీ సీఎం కేసీఆర్‌కు స్వాగతం పలికేందుకు మండలం నుంచి బీఆర్ఎస్ నాయకులు తరలివెళ్లారు. బీఆర్ఎస్ మహిళా విభాగం మండలాధ్యక్షురాలు సోలిపురం అరుణతోపాటు నాయకులు, కార్యకర్తలు భారీగా వెళ్లారు.

ఆత్మకూరు(ఎం) : తుర్కపల్లిలో మాజీ సీఎం కేసీఆర్‌కు స్వాగతం పలికేందుకు ఎదురుచూస్తున్న బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి క్యామ మల్లేశ్‌తో మండల నాయకులు



తుర్కపల్లిలో కేసీఆర్‌కు స్వాగతం పలికేందుకు ఎదురుచూస్తున్న డీసీసీబీ చైర్మన్ గొంగిడి మహేందర్‌రెడ్డి, బీఆర్ఎస్ పార్టీ నాయకులు

తుర్కపల్లి మండలం వాసాలమర్రిలో గ్రామస్తులతో మాట్లాడుతున్న బీఆర్ఎస్ అధినేత కేసీఆర్

కాంగ్రెస్ ప్రభుత్వంపై మరో పోరాటానికి సిద్ధం కండి

- వాసాలమర్రి గ్రామస్తులకు బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ పిలుపు

తుర్కపల్లి, మార్చి 31 : తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు కోసం 20ఏండ్ల క్రితం కాంగ్రెస్‌పై ఎలాంటి పోరాటాలు చేశామో అదే స్థాయి పోరాటానికి సిద్ధం కావాలని బీఆర్ఎస్ అధినేత, మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ పిలుపునిచ్చారు. ఆదివారం జనగామ, సూర్యాపేట, నల్లగొండ జిల్లాల్లో ఎండిన పంటలను పరిశీలించి తిరుగు ప్రయాణంలో ఎర్రవెల్లికి వెళ్తున్న క్రమంలో తుర్కపల్లి మండలం వాసాలమర్రి గ్రామంలో మాజీ సర్పంచ్ పోగుల ఆంజనేయులుతోపాటు పలువురు గ్రామస్తులు రోడ్డుపై ఉండడాన్ని గమనించి కేసీఆర్ కాన్వాయి ఆపి కారులోంచి దిగారు. ఈ సందర్భంగా రైతుబంధు వచ్చిందా.. వ్యవసాయానికి కరెంట్ సక్రమంగా వస్తుందా? మిషన్ భగీరథ జలాలు వస్తున్నాయా.. సంక్షేమ పథకాలు సక్రమంగా అందుతున్నాయా.. కాంగ్రెస్ ప్రభుత్వం పనితీరు ఎలా ఉంది అంటూ మాజీ సర్పంచ్, గ్రామస్తులను ప్రశ్నించారు.

బీఆర్ఎస్ పాలనలోనే తామంతా సంతోషంగా ఉన్నామని, ఇప్పుడు పథకాలు సక్రమంగా అమలు కావడం లేదని, తాగునీరు సైతం సక్రమంగా రావడం లేదని గ్రామస్తులు బదులిచ్చారు. కాంగ్రెస్ ప్రభుత్వంపై మరో పోరాటానికి సిద్ధం కావాలని, అందుకు బీఆర్ఎస్ కార్యకర్తలు కార్యోన్ముఖులు కావాలని కేసీఆర్ అన్నారు. దాదాపు 5నిమిషాల పాటు గ్రామస్తులతో ముచ్చటించిన కేసీఆర్ జనగామ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డితో కలిసి కారు ఎక్కి ఎర్రవెల్లికి బయల్దేరారు.

మాఢవీధుల్లో భక్తుల రద్దీ

యాదగిరిగుట్టలో భక్తుల సందడి

యాదగిరిగుట్ట, మార్చి 31 : పంచనారసింహుడి క్షేత్రంలో భక్తుల సందడి నెలకొన్నది. ఆదివారం సెలవు కావడంతో స్వయంభూ నారసింహుడిని దర్శించుకునేందుకు భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. మాఢ వీధులు, క్యూ కాంప్లెక్స్, క్యూలైన్లు, తిరు మాఢవీధులు, గర్భాలయ ముఖ మండపంలోని క్యూలైన్లు సందడిగా మారాయి. తెల్లవారుజాము నుంచే స్వయంభూ నారసింహుడిని భక్తులు దర్శించుకొని మొక్కులు చెల్లించుకున్నారు. స్వామివారి నిత్య తిరుకల్యాణోత్సవం, ప్రధానాలయ ముఖ మండపంలో ఉత్సవమూర్తులకు జరిగే సువర్ణ పుష్పార్చన, వేద ఆశీర్వచనంలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. బంగారు పుష్పాలతో ఉత్సవ మూర్తిని అర్చించారు. ఉదయం స్వామివారికి సుదర్శన నారసింహహోమం జరిపిన అర్చకులు కల్యాణమూర్తులకు గజవాహన సేవలను నిర్వహించారు. వెలుపలి ప్రాకార మండపంలో స్వామి, అమ్మవార్ల కల్యాణోత్సవాన్ని జరిపించారు. స్వామివారి నిత్యోత్సవాలు తెల్లవారుజాము నుంచే మొదలయ్యాయి. సాయంత్రం స్వామి, అమ్మవార్లకు తిరువీధి సేవోత్సవం, దర్బార్ సేవ నిర్వహించారు. పాతగుట్ట ఆలయంలో ఆర్జిత పూజలు నిర్వహించారు. స్వామివారి ధర్మ దర్శనానికి 2 గంటలు, వీఐపీ దర్శనానికి గంట సమయం పట్టిందని భక్తులు తెలిపారు. స్వామివారిని సుమారు 45 వేల మంది భక్తులు దర్శించుకున్నట్లు ఆలయ అధికారులు వెల్లడించారు. అన్ని విభాగాలను కలుపుకొని స్వామివారి ఖజానాకు రూ.67,62,214 ఆదాయం సమకూరిందని ఆలయ ఈఓ భాస్కర్‌రావు తెలిపారు.

భువనగిరిలో ఎగిరేది గులాబీ జెండానే



బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి క్యామ మల్లేశ్‌ను సన్మానిస్తున్న కుర్మ సంఘం నాయకులు

రాజాపేట, మార్చి 31 : లోక్‌సభ ఎన్నికల్లో భువనగిరిలో ఎగిరేది గులాబీ జెండానే అని కుర్మ సంఘం మండల నాయకుడు రేగు సిద్ధులు, మార్కెట్ కమిటీ మాజీ డైరెక్టర్ మర్ల నాగరాజు అన్నారు. తుర్కపల్లి మండలంలో భువనగిరి బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి క్యామ మల్లేశ్‌ను ఆదివారం కలిసి సన్మానించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బీఆర్ఎస్ అభ్యర్థి మల్లేశ్‌ను భారీ మెజార్టీతో గెలిపించుకుంటామన్నారు.

కార్యక్రమంలో పుప్పాల నర్సయ్య తదితరులు పాల్గొన్నారు.

కొలనుపాకలో పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం

కొలనుపాకలో ఉపాధ్యాయులతో పూర్వ విద్యార్థులు

ఆలేరు రూరల్, మార్చి 31 : మండలంలోని కొలనుపాకలో జడ్పీహెచ్ఎస్‌కు చెందిన 2010–2011 బ్యాచ్ పదో తరగతి విద్యార్థులు ఆదివారం ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. ఈ సందర్భంగా అప్పటి గురువులను సత్కరించారు. నాటి మధుర స్మృతులను జ్ఞాపకం చేసుకొని ఆనందంగా గడిపారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు మోహన్‌రెడ్డి, వేణుగోపాల్, శ్వేత, సురేశ్, శ్రీధర్, వెంకటేశ్వర్లు, అరుణ, రాంరెడ్డి, గిరీశ్, రెడ్డప్పరెడ్డి, పూర్వ విద్యార్థులు పాల్గొన్నారు.

టి.రేపాకలో ఆర్థిక సాయం అందజేస్తున్న బీఆర్ఎస్ నాయకులు

ఆర్థిక సాయం

ఆత్మకూరు(ఎం), మార్చి 31 : మండలంలోని టి.రేపాకలో బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు ఏనూతల సాయిలు ఇటీవల అనారోగ్యంతో మృతి చెందాడు. మృతుడి కుటుంబాన్ని బీఆర్ఎస్ నాయకులు ఆదివారం పరామర్శించి రూ.5వేల ఆర్థిక సాయం అందజేశారు. అదేవిధంగా బీజేపీ జిల్లా నాయకుడు తడిసిన మల్లారెడ్డి రూ.5వేల అందజేశారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ జిల్లా నాయకుడు గడ్డమీది రమేశ్‌గౌడ్, గ్రామ శాఖ అధ్యక్షుడు యాస అంజిరెడ్డి, మాజీ ఉప సర్పంచ్ బండ నర్సయ్య, రాములు, మత్స్యగిరి, మల్లయ్య పాల్గొన్నారు.

గ్రంథాలయాలతో జీవిత గమనంలో మార్పు

మునిపంపులలో గ్రంథాలయాన్ని ప్రారంభిస్తున్న కూరెళ్ల విఠలాచార్య, సుద్దాల అశోక్‌తేజ

- సినీ గేయ రచయిత సుద్దాల అశోక్‌తేజ
- గ్రామీణ గ్రంథాలయాలు విజ్ఞాన భాండాగారాలు : కవి కూరెళ్ల

రామన్నపేట, మార్చి 31 : పుస్తకాలు జీవిత గమనాన్ని మారుస్తాయని, ఊరురా గ్రామీణ గ్రంథాలయాలు ఏర్పాటు కావాలని సినీ గేయ రచయిత సుద్దాల అశోక్‌తేజ అన్నారు. మండలంలోని మునిపంపుల గ్రామంలో ఏర్పాటు చేసిన భగత్‌సింగ్ విజ్ఞాన కేంద్రం అభినవ పోతన గ్రంథాలయాన్ని కవి, రచయిత కూరెళ్ల విఠలాచార్య ఆదివారం ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన సుద్దాల మాట్లాడుతూ చదువు సమాజాన్ని ఉన్నతంగా తీర్చిదిద్దే బలమైన ఆయుధమని, గ్రంథాలయాల ద్వారానే అది సాధ్యమవుతుందని అన్నారు. గ్రామస్తులు చందాలు వేసుకొని గ్రంథాలయాన్ని ఏర్పాటు చేసుకోవడం అభినందనీయమని పేర్కొన్నారు. సుదూర ప్రాంతాలకు వెళ్లి శిక్షణ తీసుకోలేని గ్రామీణ ప్రాంత పేద విద్యార్థులు, నిరుద్యోగులకు ఇలాంటి గ్రంథాలయాలు ఎంతో ఉపయోగపడుతాయని తెలిపారు. పుస్తకాలపై మక్కువ చూపి చిన్న వయసులోనే దేశం కోసం ప్రాణాలు అర్పించిన భగత్‌సింగ్ పేరుతో విజ్ఞాన కేంద్రాన్ని నిర్మించడం నేటి తరానికి స్ఫూర్తిని నింపుతుందన్నారు. గ్రంథాలయాలను నిరుద్యోగ యువతీ, యువకులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కవి, రచయిత కూరెళ్ల విఠలాచార్య మాట్లాడుతూ గ్రామీణ గ్రంథాలయాలు విజ్ఞాన భాండాగారాలని, సమాజం మారుతున్నా పుస్తకాల ప్రాధాన్యత మారదని అన్నారు. దాతల సహకారంతో సాంకేతికత జోడించి గ్రంథాలయాలను ఏర్పాటు చేయడం అభినందనీయమని పేర్కొన్నారు. తొలుపునూరి చంద్రశేఖర్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో ఏఎస్‌పీ మిర్యాల ప్రభాకర్, క్రెడాయి జాతీయ కార్యదర్శి గుమ్మి రాంరెడ్డి, మాజీ సర్పంచ్ ఎండీ జహంగీర్, ఎస్ఐ గంటిపాక నర్సింహ, ఇన్‌చార్జి ఎంపీపీ నాగటి ఉపేందర్, నాయకులు మేక అశోక్‌రెడ్డి, జల్లెల పెంటయ్య, కల్లూరి మల్లేశ్, బొడ్డుపల్లి వెంకటేశం పాల్గొన్నారు.

ఐదు తరాల ఆత్మీయ కలయిక

కుటుంబ సభ్యుల ఆత్మీయ కలయిక

చౌటుప్పల్, మార్చి 31 : పట్టణానికి చెందిన చింతల రామచంద్రారెడ్డి, రాధమ్మ దంపతుల కుటుంబ సభ్యుల ఆత్మీయ కలయిక ఆదివారం నిర్వహించారు. మండలంలోని దండు మల్కాపురం ఆందోళ్ మైసమ్మ దేవాలయం వద్ద ఈ కార్యక్రమాన్ని చేపట్టారు.

ఐదు తరాల కుటుంబ సభ్యులు 150 మంది 30 ఏండ్ల తర్వాత కలుసుకొని ఆత్మీయంగా పలుకరించుకున్నారు.

నేడు కంఠమహేశ్వరస్వామి, సురమాంబకు బోనాలు

ఆత్మకూరు(ఎం), మార్చి 31 : మండల కేంద్రంలో గీత కార్మికుల ఆరాధ్య దైవమైన కంఠమహేశ్వరస్వామి, సురమాంబ వన దేవతలకు గౌడ సంఘం ఆధ్వర్యంలో సోమవారం బోనాలను సమర్పించనున్నట్లు గీత పారిశ్రామిక సహకార సంఘం అధ్యక్షుడు పంజాల నర్సయ్యగౌడ్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. గౌడ కులస్తులందరూ ప్రతి ఇంటి నుంచి బోనాలతో వచ్చి నైవేద్యం సమర్పించాలని కోరారు.

భక్తులకు అన్నదానం

వలిగొండ, మార్చి 31 : మండలంలోని మొగిలిపాక గ్రామంలో యాదవ సంఘం ఆధ్వర్యంలో నిర్మించిన భ్రమరాంబ, కేతమ్మ సహిత మల్లికార్జున స్వామి దేవాలయంలో విగ్రహ ప్రతిష్ఠాపన, స్వామివారి కల్యాణ మహోత్సవం సందర్భంగా బీఆర్ఎస్ పార్టీ జిల్లా నాయకుడు, మత్స్యగిరి లక్ష్మీనరసింహ స్వామి దేవస్థానం మాజీ చైర్మన్ ముద్దసాని కిరణ్‌రెడ్డి ఆదివారం భక్తులకు అన్నదానం నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ గంట హరికృష్ణ, సభ్యులు మర్ల మల్లేశం, జడిగె మల్లయ్య, మర్ల మల్లయ్య, నర్సింహ, శంకరయ్య, భిక్షపతి పాల్గొన్నారు.

వీధిలో నిలిచిన మురుగు

ఆత్మకూరు(ఎం), మార్చి 31 : మండల కేంద్రంలోని 11వ వార్డులో ఓ వీధిలో 2ఏండ్ల క్రితం సీసీ రోడ్డు నిర్మాణం చేపట్టారు. ఆ వీధిలో గతంలో రాయితో కట్టిన మురుగు కాల్వ ఉండేది. అయితే.. రోడ్డు నిర్మాణంలో భాగంగా చిన్న సైజు పైపులు వేయడంతో ఇండ్ల నుంచి వచ్చే మురుగు నీరు సాఫీగా వెళ్లడంలేదు. దీంతో వారం రోజుల నుంచి మురుగు నీటికి దారి లేక వీధిలోనే నిలుస్తుండగా దుర్వాసన వస్తున్నదని ప్రజలు పేర్కొంటున్నారు. సంబంధిత అధికారులు స్పందించి సమస్యను పరిష్కరించాలని వారు కోరుతున్నారు.

117 ఉత్తమ కథలు ఎంపిక

తెలుగు యూనివర్సిటీ, మార్చి 31: తెలంగాణ సారస్వత పరిషత్తు బాలల కథ సంకలనాలకు ఎంపిక చేసిన కథలను ప్రకటించింది. ఇటీవల పరిషత్తు పత్రిక ప్రకటన ద్వారా ఆహ్వానించిన మేరకు రెండు తెలుగు రాష్ట్రాలతో పాటు పలు ఇతర ప్రాంతాలకు చెందిన రచయితలు, రచయిత్రులు 317 కథలు పంపగా అందులో ప్రముఖ రచయితలు, రచయిత్రులు రాసిన కథలు 256, బాలల కోసం బాలలు రాసిన కథలు 61 ఉన్నాయని, వాటిని న్యాయ నిర్ణేతల సంఘం పరిశీలించి ప్రముఖ రచయితలు, రచయిత్రులు రాసిన 86 కథలు, బాలల కోసం బాలలు రాసిన 31 కథలతో కలిపి మొత్తం 117 కథలను ఎంపిక చేసినట్లు తెలంగాణ సారస్వత పరిషత్తు అధ్యక్షుడు ఆచార్య ఎల్లూరి శివారెడ్డి, ప్రధాన కార్యదర్శి డాక్టర్ చెన్నయ్య ప్రకటనలో పేర్కొన్నారు.

గుండ్లపల్లి విద్యుత్ లైన్‌మెన్‌పై బదిలీ వేటు

యాదగిరిగుట్ట, మార్చి 31 : యాదగిరిగుట్ట సెక్షన్ విద్యుత్ విభాగం గుండ్లపల్లి లైన్‌మెన్‌గా విధులు నిర్వహిస్తున్న గుణగంటి బాబుపై బదిలీ వేటు పడింది. పలు ఆరోపణలపై ఆయనను 10 రోజుల క్రితం భువనగిరి డివిజన్ కేంద్రానికి అటాచ్ చేయగా, శనివారం మోత్కూర్ సబ్‌స్టేషన్‌కు బదిలీ చేసినట్లు డీఈ మల్లికార్జున్‌గౌడ్ తెలిపారు. విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ కోసం రూ.75వేలు వసూలు చేయడంతోపాటు ట్రాన్స్‌ఫార్మర్ కాలిపోతే రూ.10వేలు, కొత్తగా నిర్మించిన ఇండ్లకు మీటర్ కోసం రూ.10 వేలు తీసుకుంటున్నట్లు జిల్లా అధికారులకు గుండ్లపల్లికి చెందిన రైతులు ముక్కర్ల శ్రీశైలం, కంబాల ప్రవీణ్, రాజు ఫిర్యాదు చేసినట్లు వెల్లడించారు. విద్యుత్ శాఖలో టీ అండ్ డీ బడ్జెట్‌లో ప్రజా అవసరాల నిమిత్తం విద్యుత్ శాఖకు సంబంధించిన డబ్బులను ప్రైవేట్ పనులకు వినియోగించి నిధుల దుర్వినియోగానికి పాల్పడుతున్నారని అధికారులు దృష్టికి తీసుకొచ్చారని తెలిపారు. దీంతో విచారణ కమిటీ వేసి బాబురావుపై పూర్తి విచారణ చేపట్టామని, తక్షణ చర్య కింద ఆయనను భువనగిరికి అటాచ్ చేయగా, తాజాగా మోత్కూర్‌కు బదిలీ చేశామని చెప్పారు. ఆయనపై నెలకొన్న అభియోగాలపై విచారణ కొనసాగుతుందని, తుది నివేదిక అనంతరం శాఖాపరమైన చర్యలు తీసుకుంటామని డీఈ తెలిపారు. విధుల పట్ల అలసత్వం వహిస్తూ నిధుల దుర్వినియోగానికి పాల్పడితే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.

నేడు ఎంపీపీ ఉమాదేవిపై అవిశ్వాసం

సంస్థాన్ నారాయణపురం, మార్చి 31 : ఎంపీపీ గుత్తా ఉమాదేవిపై సోమవారం అవిశ్వాసం ప్రవేశ పెట్టనున్నారు. ఆగస్టు 27న బీఆర్ఎస్ పార్టీకి చెందిన 9మంది ఎంపీటీసీలు ఎంపీపీపై అవిశ్వాస తీర్మానం ఇవ్వగా.. ఆమె హైకోర్టు నుంచి స్టే తెచ్చుకోవడంతో ఆగిపోయింది. ప్రస్తుతం హైకోర్టు స్టే కొట్టివేయడంతో అవిశ్వాసంపై సమావేశం ఏర్పాటు చేయాలని ఆర్డీఓ శేఖర్‌రెడ్డి ఆదేశాలు ఇవ్వగా.. ఆ మేరకు మండల అధికారులు ఎంపీటీసీలకు నోటీసులు అందజేశారు. మండలంలో గత ఎన్నికల్లో బీఆర్ఎస్ నుంచి 10మంది, సీపీఎం నుంచి ఇద్దరు, సీపీఐ నుంచి ఒకరు ఎంపీటీసీలుగా గెలుపొందారు. బీఆర్ఎస్ నుంచి గెలిచి ఎంపీపీ అయిన ఉమాదేవి కాంగ్రెస్ పార్టీలో చేరడంతో ఆ పార్టీ ఎంపీటీసీలు ఆమెపై అవిశ్వాస తీర్మానం పెట్టారు.

అయితే.. అవిశ్వాసం నెగ్గడానికి 9మంది ఎంపీటీసీల అవసరం ఉండగా.. బీఆర్ఎస్ పార్టీకి చెందిన వారు 8 మంది ఉన్నారు. అవిశ్వాసం నెగ్గడం, వీగడం అనేది సీపీఎం ఎంపీటీసీ మద్దతుపై ఆధారపడి ఉన్నది.

2, 3 తేదీల్లో జడ్పీ స్థాయీసంఘాల సమావేశాలు

భువనగిరి కలెక్టరేట్, మార్చి 31 : జిల్లా పరిషత్ స్థాయీ సంఘాల సమావేశాలను ఏప్రిల్ 2, 3 తేదీల్లో స్థానిక జడ్పీ కార్యాలయ సమావేశ మందిరంలో నిర్వహించనున్నట్లు జిల్లా పరిషత్ సీఈఓ ఎన్.శోభారాణి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 2న ఉదయం 10:30 గంటలకు ఒకటవ, ఏడో స్థాయీ సంఘం (ఆర్థిక సంఘం) సమావేశం, మధ్యాహ్నం 12 గంటలకు రెండో స్థాయీ సంఘం (గ్రామీణాభివృద్ధి), మధ్యాహ్నం 2 గంటలకు నాల్గవ స్థాయీ సంఘం (విద్య, వైద్యం) సమావేశాలు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. 3న ఉదయం 10:30 గంటలకు ఐదవ స్థాయీ సంఘం (మహిళా, శిశు సంక్షేమం), 11:30 గంటలకు మూడో స్థాయీ సంఘం (వ్యవసాయం), మధ్యాహ్నం 2:30 గంటలకు ఆరో స్థాయీ సంఘం (సాంఘిక సంక్షేమం) సమావేశాలు ఉంటాయని తెలిపారు. సమావేశాలకు ఆయా స్థాయీ సంఘాల సభ్యులు, అధికారులు సకాలంలో హాజరు కావాలని సూచించారు.

వైభవంగా రామలింగేశ్వరుడి అగ్నిగుండాలు

మోత్కూరు, మార్చి 31 : మున్సిపాలిటీ కేంద్రంలో రామలింగేశ్వరస్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఆదివారం తెల్లవారుజామున స్వామివారి అగ్నిగుండాలు నిర్వహించారు. శనివారం అర్ధరాత్రి ఆలయం ఎదుట ఏర్పాటు చేసిన అగ్ని గుండాలకు నిప్పు అంటించి స్వామివారిని శేష వాహనంపై పట్టణ పుర వీధుల్లో ఊరేగింపు చేశారు. డప్పు, మహిళా కోలాటం, భజన, వాయిద్య కళాకారులు భక్తి పాటలను ఆలపిస్తూ రాత్రంతా సంకీర్తనలు చేశారు. మహిళలు స్వామివారికి మంగళహారతులు పట్టారు. కల్యాణ మండపం వద్ద లింగాయత్ బలిజలు స్వామివారి ఖడ్గాలను చదువుతూ గెలుపు నిర్వహించారు. అనంతరం ఆలయ కమిటీ ఆధ్వర్యంలో ప్రముఖులను సన్మానించి, భక్తులకు అన్నదానం చేశారు. కార్యక్రమంలో ఆలయ అభివృద్ధి కమిటీ చైర్మన్ గుండగోని రామచంద్రుగౌడ్, మున్సిపల్ చైర్పర్సన్ గుర్రం కవిత, వైస్ చైర్మన్ బొల్లేపల్లి వెంకటయ్య, ప్రతినిధులు పాల్గొన్నారు.

మోత్కూరులో రామలింగేశ్వరస్వామిని శేష వాహనంపై మోసుకుంటూ అగ్నిగుండం నుంచి నడిచి వెళ్తున్న భక్తులు